ప్రజాశక్తి

మంగళవారం 12 సెప్టెంబరు 2023

5

శ్రీకాకుళం

డ్రైవర్లకు సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 13వ బ్యాచ్ విద్యార్థులకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ప్రదానం చేశారు. శిక్షణ తీసుకున్న డ్రైవర్లకు అభినందిస్తూ దిశా నిర్దేశం చేశారు. 14వ బ్యాచ్ ఈ వారంలో ప్రారంభమవుతుందని, వివరాల కోసం 9963091999, 7382923293 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. శిక్షణ తీసుకున్న డ్రైవర్లు తాము తీసుకున్న శిక్షణ భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఎఎస్‌ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

- మూతపడిన దుకాణాలు
- విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన యాజమాన్యాలు
- పలుచోట్ల రహదారులపై టిడిపి శ్రేణుల ఆందోళన, అరెస్టులు
- మూడో రోజూ సాగిన ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి / యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ జాతీయాధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి సోమవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో పలుచోట్ల ఆర్‌టిసి కాంప్లెక్సులు, రహదారులపై టిడిపి శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. రోడ్లపై బైఠాయించడంతో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో పలుచోట్ల విద్యాసంస్థలు, దుకాణాలు మూతపడ్డాయి. ప్రయివేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. టెక్కలిలో జాతీయ రహదారిపై టిడిపి నాయకులు ఆందోళనకు దిగడంతో సుమారు 20 నిమిషాల పాటు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. శ్రీకాకుళం, పలాస ఆర్‌టిసి కాంప్లెక్సుల్లో బస్సులను అడ్డుకునేందుకు వచ్చిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో పాటు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ముఖ్య నాయకుల గృహ నిర్బంధం మూడో రోజూ కొనసాగింది.

శ్రీకాకుళంలో...

టిడిపి బంద్ పిలుపు నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలోని అరసవల్లిలో గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులను వారి నివాసంలో పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. బస్సులను ఆపేందుకు టిడిపి శ్రీకాకుళం నగర పార్టీ నాయకులు ఉదయం ఆరు గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్సుకు చేరుకున్నారు. కాంప్లెక్సుకు ఎదురుగా కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. అప్పటికే వాహనాలతో సిద్ధంగా ఉన్న పోలీసులు వారిని అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్‌ను శ్రీకాకుళం రూరల్ పోలీసులు కిష్టప్పపేటలోని ఆయన ఇంట్లో హౌస్ అరెస్టు చేశారు. సోమవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యాన టిడిపి నాయకులు నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ దాష్టీకానికి చీకటి రోజని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనం కోసం జగన్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

కవిటిలో...

కవిటిలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను ఆయన నివాసంలో గృహ నిర్బంధం చేశారు. జాడుపుడి ఆర్.ఎస్‌లో టిడిపి నాయకులు బంద్ పాటించారు. విద్యాసంస్థలు, దుకాణాలు మూయించి నిరసన వ్యక్తం చేశారు.

ఇచ్ఛాపురంలో...

ఇచ్ఛాపురంలో బ్యాంకులు, ప్రైవేటు విద్యాసంస్థలు మూతపడ్డాయి. బంద్ చేస్తున్న సమయంలో పోలీసులు జోక్యంతో ప్రభుత్వ విద్యాసంస్థలు యథావిధిగా పనిచేశాయి.

సోంపేటలో...

సోంపేటలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను పలాసకు రానివ్వకుండా పోలీసులు ఇంటి వద్దే హౌస్ అరెస్టు చేశారు. ఉదయం నుంచే గౌతు శివాజీ ఇంటి చుట్టూ భారీగా పోలీసులు మోహరించారు. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు బంద్‌ను పాటించాయి. మాజీ ఎంపిపి చిత్రాడ శ్రీను, మాజీ జెడ్‌పిటిసి సూరాడ చంద్రమోహన్, బీన ఆనంద్ తదితరులను అరెస్టు చేశారు. బారువలో నాగేశ్వరరావు, ఎం కుమార్, దున్న సత్యం, టి.వాసు, ఆర్.రమణ తదితరులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆమదాలవలసలో...

ఆమదాలవలసలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు మెట్ట సుజాత ఆధ్వర్యాన ఉదయం 7 గంటల నుంచి టిడిపి శ్రేణులు రోడ్డు పైకి వచ్చి బంద్‌ను నిర్వహించాయి. పట్టణ శివారున ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన టిడిపి శ్రేణులు రాస్తారోకో చేయడంతో పాలకొండ–శ్రీకాకుళం రోడ్డు పైన భారీగా ట్రాఫిక్ స్తంభించింది. తమ్మినేని సుజాతతో పాటు టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్, టిడిపి మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు

కోటబొమ్మాళిలో...

కోటబొమ్మాళి రైతుబజారు నుంచి కొత్తపేట వరకు ర్యాలీ నిర్వహించి షాపులను మూసివేసి బంద్‌కు సహకరించాలని వ్యాపారులను టిడిపి నాయకులు కోరారు. పోలీసులు ర్యాలీని అడ్డుకుని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, ఎఎంసి మాజీ చైర్మన్ వెలమల కామేశ్వరరావు తదితరులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, మాజీ ఎంపిపి వెలమల విజయలక్ష్మి, గొండు లక్ష్మణరావు తదితరులు ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు బోయిన రమేష్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

పొందూరులో...

పొందూరులో టిడిపి నాయకుల ఇళ్లకు పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలోని పొందూరు పట్టణం, కింతలి కూడలి, లోలుగు కూడలిలో పెద్దఎత్తున టిడిపి కార్యకర్తలు నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించి బంద్ చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, దుకాణాలు, సినిమా హాళ్లు మూసివేశారు. టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, సీపాన శ్రీరంగనాయకులు, అన్నెపు రాము తదితరులు పాల్గొన్నారు.

పలాసలో...

పలాసలో ఆర్‌టిసి బస్సులను ఆపేందుకు ప్రయత్నించిన టిడిపి నాయకులు పోలీసులు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు, పట్టణాధ్యక్షులు బి.నాగరాజు తదితరులున్నారు.

మందసలో...

మందస మండలం హరిపురంలో టిడిపి మండల అధ్యక్షుడు భావన దుర్యోధనతో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సరుబుజ్జిలిలో...

సరుబుజ్జిలి మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసిన టిడిపి మండల అధ్యక్షుడు ఎ.రాంబాబుతో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రొట్టవలస వద్ద అలికాం–బత్తిలి రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగిన తెలుగు యువత మండల అధ్యక్షుడు తాడేల రాజారావు, నాయకులను అరెస్టు చేశారు. జనసేన నాయకులను ముందస్తు అరెస్టు చేశారు.

టెక్కలిలో...

టెక్కలిలో టిడిపి శ్రేణులు జాతీయ రహదారి పైకి చేరుకుని ధర్నా చేపట్టాయి. దీంతో 20 నిమిషాల పాటు రహదారికి ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. టిడిపి మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావుతో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మెళియాపుట్టిలో...

మెళియాపుట్టి, చాపర, జాడుపల్లి, పట్టుపురం తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తూ దుకాణాలను మూసివేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు

వజ్రపుకొత్తూరులో...

పూండి రహదారి కూడలిలో ధర్నాకు దిగిన నాయకులు పుచ్చ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, రెయ్యాపాడు మాజీ సర్పంచ్ సైనీ బాలాజీని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలాకిలో...

పోలాకిలోని కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పోలాకి కేంద్రంలో టిడిపి నాయకులు ఎం.వెంకట అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, బైరి భాస్కరరావును హౌస్ అరెస్ట్ చేశారు.

లావేరులో...

లావేరు మండలంలో లావేరు, సుభద్రాపురం, వెంకటాపురంలో టిడిపి నాయకులు దుకాణాలను మూసివేయించారు. ఎఎంసి మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర ఆధ్వర్యాన లావేటిపాలెం, కేశవరాయునిపురం, జి.జి.వలస, లావేరులోని జెడ్‌పి పాఠశాలలు, జూనియర్ కళాశాల, ఎపిజివి బ్యాంకును మూసివేయించారు. తాళ్లవలసలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

జలుమూరులో...

జలుమూరులో బంద్ పాక్షికంగా జరిగింది. దుకాణాలు యదావిధిగా తెరుచుకున్నాయి. ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి.

కొత్తూరులో...

కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో దుకాణాలను మూసివేయించేందుకు ప్రయత్నించిన టిడిపి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అగతముడి అరుణ్ కుమార్, లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, టి.తిరుపతిరావు, ఎం.కృష్ణ తదితరులున్నారు.

నందిగాంలో...

నందిగాం టిడిపి మండల నాయకులు అజయ్‌కుమార్, ప్రసాదరావు, అట్ట రవిప్రసాద్‌లను వారి వారి ఇళ్ల వద్ద ఉదయం ఆరు గంటలకే పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

కంచిలిలో...

కంచిలితో పాటు పరిసర గ్రామాలోని షాపులు మూతపడ్డాయి. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలను మూసివేయించారు. ప్రయివేటు బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పది గంటలు తరువాత ఆటోలు తిరిగాయి.

కోటబొమ్మాళి : టిడిపి నాయకుల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

ఇచ్ఛాపురం : ఎస్‌బిఐను మూసివేయిస్తున్న టిడిపి నాయకులు

శ్రీకాకుళంలో టిడిపి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కవిటి : ఎమ్మెల్యే అశోక్‌ను గృహ నిర్బంధం చేస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్ : జాతీయ రహదారిపై బైఠాయించిన టిడిపి నాయకులు

జీడికి రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలి

- ప్రజాసంఘాల నాయకుల మహా రాయబారం
- 'స్పందన'లో జాయింట్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర చెల్లించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రజాసంఘాల నాయకులు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను కోరారు. మహా రాయబారం పేరిట నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జూలై 19వ తేదీన జీడి రైతులతో మంత్రి అప్పలరాజు, కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదన్నారు. రైతులు పండించిన జీడిపిక్కల ధర రోజురోజుకూ తగ్గుతుంటే, వ్యాపారులు ఉత్పత్తి చేస్తున్న జీడిపప్పు ధర ఆకాశాన్ని అంటుతోందన్నారు. 2019లో 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.14వేలు పలికితే, నేడు రూ.ఏడు వేలు చెల్లిస్తామని వ్యాపారులు చెప్తున్నారని తెలిపారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా మంత్రి అప్పలరాజుకు పట్టడం లేదని, మద్దతు ధర కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదని విమర్శించారు. మద్దతు ధరకు ఆరు నెలలుగా రైతులు ఆందోళన చేస్తుంటే, జిల్లాలోని మంత్రులు, స్పీకర్ స్పందించడం లేదన్నారు. తక్షణమే వారు జోక్యం చేసుకుని రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు. జీడి రైతులు ఒంటరిగా లేరని, వారి పోరాటానికి ఉద్యోగ, కార్మిక, కర్షక సంఘాలు మద్దతుగా ఉన్నాయన్నారు. మహా రాయబారంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, మత్స్యకార సంఘం జిల్లా కో–కన్వీనర్ ఐ.పాపయ్య, టి.శాంతారావు ఎఐటియుసి నాయకులు చిక్కాల.గోవిందరావు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

దొంగలకు దొంగ చంద్రబాబు

పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.370 కోట్లు స్వాహా చేసిన చంద్రబాబు, దొంగలకు దొంగ అని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బెండిలో జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు హనుమంతు వెంకటరావు దొర ఆధ్వర్యాన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అవినీతి చేయలేదు, తానొక నిప్పు అని చెప్పిన చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికిపోయి నిప్పు కాదు తుప్పు అనిపించుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాకోర్టులో చంద్రబాబును ప్రజలే శిక్షించాలని, అవి రాబోయే 2024 ఎన్నికల్లో అవినీతి చక్రవర్తికి బుద్ధి చెప్పాలన్నారు.

అప్పయ్య దొర ఆశయాలు కొనసాగిద్దాం

మాజీ ఎమ్మెల్యే అప్పయ్యదొర ఆఫ్‌షోర్ రిజర్వాయర్ కోసం ఎంతో శ్రమించారని, ఆ ప్రాజెక్టు పూర్తి చేసి ఆయన కలలను సాకారం చేద్దామని అన్నారు. పెద్దబొడ్డపాడు, సీతాపురం, కొండవూరు పరిధిలో సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందించడానికి బెండిగెడ్డపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదనలు ఒక కొలిక్కి వచ్చాయని, ఈ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. పొరపాటున మళ్లీ టిడిపికి అవకాశం ఇస్తే జన్మభూమి కమిటీలతో దోపిడీకి మళ్లీ తెర తీస్తారన్నారు. మాట ఇస్తే మాట మీద నిలబడే జగన్ సేవలు రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు పి.గురయ్యానాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైస్ ఎంపిపి తమ్మినాన శ్రావణి, ఎంపిటిసి ప్రతినిధి తమ్మినాన శాంతారావు, సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస

ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిర్వహించే శాంతియుత ప్రదర్శనపై పోలీసులు విచక్షణారహితంగా దాడులు చేయడంపై జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి తీవ్రంగా ఖండించారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి జిల్లా కోర్టు ఆవరణ, ఆమదాలవలసలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ పోలీసుల జులం తగదని, వారిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయవాదులకు రక్షణ కల్పించాలన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా న్యాయపరంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్కడి న్యాయవాదులకు మద్దతుగా ఒక్కరోజు విధులను బహిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణపై ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాల నిర్వహణలో అధికారులు, వైద్యులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ వాలంటీర్లు వారి పరిధిలోని అన్ని కుటుంబాలను సందర్శించి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించాలన్నారు. ఎఎన్ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం అందించడం ద్వారా ఇంటింటికీ వెళ్లి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాల్లో, వార్డుల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. శిబిరాలకు ఇద్దరు స్పెషలిస్టులు, ఇద్దరు పిహెచ్‌సి వైద్యులు హాజరవుతారని, రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందజేస్తారన్నారు. ఈనెల 15 నుంచి కార్యక్రమాన్ని వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తారని తెలిపారు. 16న వైద్య బృందాల పరిశీలన ఉంటుందన్నారు. ఆ తర్వాత వైద్యులు గ్రామాల వారీగా సందర్శించి శిబిరాలను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి, ఉప కలెక్టర్ జయదేవి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు తగ్గిన వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి బంద్‌కు పిలుపునివ్వడం, వ్యవసాయ పనుల్లో రైతులు తలమునకలై ఉండడంతో 'స్పందన'కు వినతుల సంఖ్య తగ్గింది. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ నవీన్ వినతులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 132 వినతులను స్వీకరించారు. జిల్లాలో ఇటీవల చేపట్టిన సమగ్ర భూసర్వేలో లోపాలను సరిదిద్దాలని పలువురు రైతులు కోరారు. నందిగాం మండలం కణితూరుకు చెందిన పలువురు రైతులతో కలిసి ఎంపిటిసి సభ్యుడు మెట్ట శ్యామలరావు వినతిపత్రం అందజేశారు. పాసు పుస్తకాల్లో పేర్లు తప్పుగా నమోదయ్యాయని, వాటిని సవరించాలని కోరారు. హక్కుదారులను కాదని వేరే వ్యక్తుల పేర్లతో పాసు పుస్తకాలు వస్తున్నాయని, వాటిని సరిదిద్దాలని ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమగ్ర శిక్షలో కాలవ్యవధి ఆధారంగా తరగతులను నిర్వహించిన అధ్యాపకులను ఇటీవల జరిగిన నియామకాల్లో ప్రాధాన్యత కల్పించలేదని, ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న 46 పోస్టుల్లో నియామకాలను చేపట్టి ఉద్యోగాల్లో కొనసాగించాలని కోరుతూ పలువురు అభ్యర్థులు వినతిపత్రం అందజేశారు. వీటితోపాటు వ్యక్తిగత, సామాజిక అవసరాలను తీర్చాలని కోరుతూ పలువురు వినతిపత్రాలను అందజేశారు.

పదేపదే వస్తున్న వినతులపై దృష్టిసారించాలి

జిల్లాలో స్పందన, జగనన్నకు చెబుదాం, ఎపి ఆన్‌లైన్‌లో వస్తున్న ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించకపోతే ఒకే దరఖాస్తు పదేపదే వస్తుందని, దీనివల్ల బాధితులకు వ్యయంతో పాటు సమయం వృథా అవుతుందని కలెక్టర్ అన్నారు. స్పందన ద్వారా అర్జీదారులు లాభపడాలని, ఈ విషయంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలన్నారు. ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్‌తో కలిసి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE COURT, SRIKAKULAM

E.P. 14/2022 O.S. 126/2018

BETWEEN:

CHITTIRI BHAVANI @ DHANNANA BHAVANI ...DHR /PLAINTIFF

AND

CHITTAJALLU VISWANADHAM ...JDR / DEFENDANT

To

Chittajallu Viswanadham
S/o Krishna Murthy
D.No.2-2-25/8, Bondilipuram
Srikakulam Town & Dist.

NOTICE

పై నెంబర్ ఇ.పి. దాఖలు చేయగా మీకు Order 21, R 54 CPC నోటీసు నిమిత్తం తే 26-09-2023 దీ కి వాయిదా అయివున్నది. కావున వాయిదా తే 26-09-2023 దీన మీరు ఉ॥ గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగాగాని, లేదా అడ్వకేటు ద్వారా కాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడం అగునని ఈ నోటీసు మూలకంగా తెలియజేయడం అయినది.

శ్రీకాకుళం
తేది : 10-09-2023

పి.వి.యస్.సీతారామయ్య, అడ్వకేట్, న్యూకోలనీ, శ్రీకాకుళం.
సెల్ : 9848407726

IN THE HON'BLE COURT OF THE IVTH ADDL. DISTRICT JUDGE CUM SC & ST COURT AT SRIKAKULAM

O.S 31/2022

BETWEEN:

GOLIVI BHADRAMMA @ BHAVANI ...PLAINTIFF

AND

SADHU VENKATAPPADU & 44 OTHERS .... DEFENDANT

Notice to Defendent No.27

Jampana Rama, W/o Venkata Suryanarayana
Age : 47 years, Hindu
D.No.1-23, Garikapalem Village
Ranasthalam Mandalam, Srikakulam Dist.

NOTICE

పై నెంబరు దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ Honourable 4th Addl. District Judge cum SC & ST Court, Srikakulam వారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. సదరు దావాలో మీకు ఎటువంటి అభ్యంతరములు వున్నా స్వయంగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని తే 26-09-2023 దిన ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

ఎన్. విజయకుమార్
వి.యస్. శ్రీనివాసరావు
ఎ. అప్పలరాజు
అడ్వకేట్స్, శ్రీకాకుళం.

SUIT SUMMON (Order V, Rule 4, 5 C.P.C) IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AMADALAVALASA

O.S.136/2021

Between:

Koyyana Bhaskara Rao. --Plaintiff.

And : Puppala Venkata Ramana Rao & Others --Defendants

To,

4th Defendant :

Peddinti Lakshmi, W/o Peddinti Rajulu, Kameswari Peta, Moyyudu Peta, Sarubujjili Mandalam,Srikakulam District -Pin:532 190.

పై నంబరు దావా లో వాది దావా షెడ్యూలు ఆస్తులు పంపకం కొరకు ప్రతి–వాదులు అయిన మీ పై దాఖలు చేసి వున్నారు. సదరు దావా లో 4వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం తే. **26-09-2023 దీ కి వాయిదా అయి వున్నది. కావున వాయిదా నాడు పగలు 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మా నించడమగునని యిందుమూలంగా తెలియడమైనది.

SUDHA SURYA RAO
B.SUDARSHANA RAO
KARANAM APPALANAIDU
ADVOCATES,SRIKAKULAM,
CELL: 9440156922

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

ఇంటింటికీ తాగునీరు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వి.అర్.గూడెంలో రూ.80 లక్షల అంచనాలతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటా తాగునీటి కుళాయిలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. తాగునీటి అవసరాన్ని గుర్తించి జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి ఇస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, నాయకులు నాగేశ్వరరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ట్రస్టు సేవలు విస్తృతం

బూర్జ : ఇందుమతి, శ్రీరామ్మూర్తి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా విస్తృతంగా సేవలు అందిస్తున్నట్లు సీతారాం అన్నారు. మండలంలోని గుత్తావల్లి, బూర్జ ఆమదాలవలస మండలం అక్కులపేట పిహెచ్‌సిలకు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను వైద్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నెన దీప, జెడ్‌పిటిసి బెజ్జపురం రామారావు, మండల పార్టీ అధ్యక్షులు, టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎస్‌పి స్పందనకు 36 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్‌పి జి.ఆర్.రాధిక నిర్వహించిన స్పందనకు 36 అర్జీలు అందాయి. ఎస్‌పితో పాటు ఎఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఫిర్యాదుదారులతో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఫిర్యాదులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. కుటుంబ తగాదాలకు మూడు, పౌర సంబంధాలకు పది, మోసపూరితమైన రెండు, పాత ఫిర్యాదులు ఆరు, ఇతర ఫిర్యాదులు 15 వచ్చాయి.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

సహోద్యోగులు ఒక్క రోజు గౌరవ వేతనం చెక్కును మృతి చెందిన హోంగార్డు కుటుంబ సభ్యులకు ఎస్‌పి అందజేశారు. గత నెలలో అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు సవర గాసేడు మృతి చెందారు. జిల్లాలోని హోంగార్డులందరూ సమకూర్చిన ఒక్క రోజు గౌరవ వేతనం రూ.4.23 లక్షల నగదు చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పి.వి.నర్సింగరావు పాల్గొన్నారు.

ఇ-క్రాప్‌నకు సిబ్బంది కొరత

- రెండు రోజుల గడువుతో రైతుల్లో గుబులు
- 50 శాతం మాత్రమే నమోదు
- గడువు పెంపుపై ఆశలు

రైతుల గుండెల్లో ఇ-క్రాప్ గుబులు పుట్టిస్తోంది. నమోదుకు మూడు రోజులు మాత్రమే గుడువు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పండిస్తున్న పంటలకు ఇ క్రాప్ తప్పనిసరని, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని పదేపదే జిల్లా కలెక్టర్‌తోపాటు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అడుగు ముందుకు పడడం లేదు. మండలంలో ఇప్పటి వరకు కేవలం సుమారు 40 శాతం మాత్రమే ఇ క్రాప్ నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రజాశక్తి- పలాస

మండలంలో సుమారు 12,226 ఎకరాల్లో వరి, జీడి, కొబ్బరి, మామిడి, పనస, మునగ తదితర పంటలను సాగుచేస్తున్నారు. అందులో వరికి సంబంధించి 9437 ఎకరాల్లో ఎదలు, ఉబాలు వేశారు. రైతులు పండిస్తున్న పంటలకు ఇ క్రాప్ చేయాలని సుమారుగా గత నెల రోజులుగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బాలాజీ లాఠకర్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్ర స్థాయిలో అనుకున్నంతగా ఇ క్రాప్ నమోదు కాలేదు. అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలో ఇప్పటి వరకు సుమారు 6656 ఎకరాల్లో ఇ క్రాప్ జరగగా అందులో వరికి సంబంధించి 4953 ఎకరాల్లో పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

అల్లుకోలలో ఇ-క్రాప్ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వేధిస్తున్న సిబ్బంది కొరత

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతోపాటు పలాస మండల పరిధిలో 21 రైతు భరోసా కేంద్రాలున్నాయి. అందులో 21 మంది వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను నియమించాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే పని చేస్తున్నారు. అందులో తర్లకోట అగ్రికల్చరల్ అసిస్టెంట్ పదోన్నతిపై వెళ్ళి పోగా పదకొండు మాత్రమే మిగిలారు. దీంతో పూర్తి స్థాయిలో పనులు జరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కో అగ్రికల్చరల్ అసిస్టెంట్ రెండు సచివాలయాల పరిధిలో ఉన్న పంటలను ఇ క్రాప్ చేయాల్సి వస్తుందని, పని భారం పెరగడంతో పనులు చేసేందుకు మొగ్గు చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఇ క్రాప్ ఎంత వరకు వచ్చింది? ఎంత శాతం చేశారు? తదితర అంశాలపై ఆరా తీస్తున్న సమయంలో ఇ క్రాప్ చేస్తున్నామని చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో చేయడంలేదనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

50 శాతం మాత్రమే...

మండలంలో ఇప్పటి వరకు సుమారు 50 శాతం మాత్రమే ఇ క్రాప్ నమోదైంది. ఈ నెల 15 తేదీలోగా నమోదు పూర్తి చేయాలని జిల్లా ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులకు అల్టిమేట్ జారీ చేశారు. నెల రోజుల నుంచి ప్రారంభించినా ఇప్పటి వరకు 50 శాతం పూర్తి చేయగా కేవలం మూడు రోజుల్లో మరో 50 శాతం పూర్తి చేయడం కష్టతరం. మండలంలోని మాకన్నపల్లి, బొడ్డపాడు, గురుదాస్ పురం, నీలావతి, చినంచల తదితర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో నమోదు కాలేదు. ఈ విషయం తెలుసుకున్న రైతులు తమ పంటలకు ఇ క్రాప్ చేయలేదని, ప్రకతి వైపరీత్యాల సమయంలో నష్ట పరిహారం అందక పోవచ్చునని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం పై పలాస వ్యవసాయ శాఖ ఎడిఎ ఎల్ వి మధు ను వివరణ కోరగా ఇ క్రాప్ నమోదు శాతం తగ్గడం వాస్తవమేనని, సిబ్బంది కొరత వల్ల ఈ సమస్య తలెత్తుతోందన్నారు.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకు వెళ్లామని, అయితే ఇ క్రాప్ నమోదుపై సమయం పెంచే అవకాశం ఉందని చెప్పారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధర్మాన

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

శ్రీకాకుళం అర్బన్ : నగర పాలక సంస్థ పరిధిలోని రోడ్లను ఆధునీకరించడం ద్వారా ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడతాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ నిధులతో నిర్మిస్తున్న పలు రోడ్లకు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.1.82 కోట్ల వ్యయంతో పాత్రునివలస నుంచి పెద్దపాడు పెట్రోల్ బంక్ వరకూ ఉన్న 1.95 కి.మీ. రోడ్డు, తంగివానిపేట నుంచి వానవానిపేట వరకూ ఉన్న 1.5 కి.మీ. రహదారి పనులు చేపట్టనున్నట్టు వివరించారు. నాణ్యతతో చేపట్టి ప్రజలకు సౌకర్య వంతంగా ఉండేలా నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, వైసిపి నగర అధ్యక్షులు సాధు వైకుంఠరావు, వైసిపి నాయకులు గాంధీ, డాక్టర్ పైడి మహేశ్వరరావు, తంగి అప్పన్న, అసిరినాయుడు, గుడ్ల దాము పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఇఇగా శంకరరావు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి సబ్ డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి.శంకరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. టెక్కలిలో విధులు నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి రాజశేఖర్ విశాఖపట్నం బదిలీపై వెళ్లారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంపతిరావు శ్రీనివాసరావు, టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం ఎఇలు పుష్పగుచ్ఛం ఇచ్చి శంకరరావును స్వాగతం పలికారు.

గ్రానైట్ పరిశ్రమలో స్థానిక కూలీలను నియమించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ప్రాంతంలో గ్రానైట్ కంపెనీలు స్థానిక కార్మికులను తొలగించి బీహార్ ఒరిస్సా, రాజస్థాన్‌ల నుంచి కార్మికులను రప్పించుకుని రాత్రి, పగలు పనిచేయించుకుంటున్నారని సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీలలో భద్రతా చర్యలను చేపట్టడం లేదని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. స్థానిక స్టెర్లిన్ స్టోనెక్స్ గ్రానైట్ కంపెనీలో గత ఐదు సంవత్సరాలకుపైగా ఎప్పటి నుంచో పని చేస్తున్న స్థానిక గిరిజన, గిరిజనేతర కార్మికులను ఒకేసారి సుమారు 40 మందిని తొలగించారని, స్థానికేతరులు హిందీ రాష్ట్రాల కార్మికులతో ఫోర్ట్ ట్రాక్టర్ డ్రిల్లింగ్ చేయించుకుంటున్నారన్నారు.. తొలగించిన కార్మికులకు చట్టపరంగా చెల్లించాల్సిన బెనిఫిట్స్ కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. గ్రానైట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టెక్కలి తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి యల్లయ్య, సింహాచలం, దల్లి భీమారావు, రాజారావు, అడ్యాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందాయని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శ చిట్టిపాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. కాశీబుగ్గలో కుమారన్న, సీతారాం వర్ధంతి వేడుకలో భాగంగా సోమవారం వర్తమాన రాజకీయాలపై సభ నిర్వహించారు. మణిపూర్ మండిపోతున్నా మాట్లాడని ప్రధాని సనాతన ధర్మంలోని అంశాలు, అభివృద్ధి నిరోధక మైనవని వాటిని నిర్మూలించాలన్న ఉదయనిధి మాటలను వక్రీకరించి అతని తలకు వెలకట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి లేకపోవడం, భూమి సమాస్య తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. 2022 అటవీ హక్కుల సౌరక్ష నియమాలను రద్దు చేయాలన్నారు. కార్మిక చట్టాల సవరణను ఆపాలని డిమాండ్ చేశారు. న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు భీమారావు, పాపయ్య, కూర్మారావు, ఐఎఫ్‌టియు నాయకులు జుట్టు వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతిక సమైక్య భీమశంకర్, రామారావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్ పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి- నందిగాం

క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని తమలో దాగివున్న ప్రతిభను కనపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకష్ణారావు, ప్రధానోపాధ్యాయులు హరిబాబు, ఎంపిటిసి సభ్యులు అంబోడి విష్ణు, పిడి శ్రీనివాసరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యక్షులు సనపల చిన్నారావు, ప్రగడ ఖగేశ్వరరావు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన కార్యకర్తలు

ఘనంగా రాజు జన్మదిన వేడుకలు

ఇచ్ఛాపురం: జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వీర మహిళలు, జన సైనికులు భారీగా పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం రాజు చేత కేక్‌ను కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా పాల్గొన్నారు.

గోతులను పూడ్చివేయిస్తున్న ఎస్‌ఐ అశోక్‌బాబు

మేము సైతం...

ప్రజాశక్తి- బూర్జ

మేము సైతం సేవలకు సిద్ధమని నిరూపించుకున్నారు స్థానిక పోలీసులు. శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారి బూర్జ మండల పరిధిలోని పూర్తిగా గోతులు మయంగా మారింది. కేవలం నెల రోజుల్లోనే 15 వరకు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. రామన్నపేట వద్ద ఆదివారం మహిళలు గోతులు కప్పగా... సోమవారం స్థానిక ఎస్‌ఐ అశోక్ బాబు ఆధ్వర్యాన పోలీసులు సహాయంతో అప్పలపేట వద్ద ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చారు. ఏదేమైనా పోలీస్ యంత్రాంగం కూడా ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రమాదాల నివారణకు సేవలు అందించడం అభినందించదగ్గ విషయమని గ్రామస్తులు కొనియాడారు.

మొక్కలను నాటుదాం

ఇచ్ఛాపురం : జెసిఐ వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం స్థానిక ఎల్ మ్యాక్స్ థియేటర్ వద్ద రోడ్ పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని అధ్యక్షులు స్వరూప్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి షణ్ముఖరావు, పూర్వ అధ్యక్షులు జి.ఢిల్లేషు, సభ్యులు నవీన్‌కుమార్, పవన్ కుమార్, ప్రవీణ్ కుమార్, ప్రేమ్‌సాయి పాల్గొన్నారు.

గోవింద్‌కు ఆర్థికసాయం

కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం తాళ్లవలసకు చెందిన గోవింద్ ఆచారి అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న కొత్తపేటకు చెందిన హెల్పింగ్ హాండ్స్ సేవా సంఘం సభ్యులు ఆయనకు రూ.పది వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. గోవింద్‌కు ఆరోగ్యశ్రీ వర్తించడంతో తిరుపతిలో ఆపరేషన్‌కి సిద్ధమవుతున్నాడు. ఇతర ఖర్చు నిమిత్తం రూ.30 వేలు అవసరం కావడంతో ఈ సంస్థ రూ.పది వేలు ఆర్థికసాయం అందించింది. కార్యక్రమంలో జీరు రామకృష్ణ, వెలమల ఆనంద్, దాసరి కిట్టు, సుంకరి రాము, దాట్ల రామిరెడ్డి, షణ్ముఖ మాస్టర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై మరిన్ని పోరాటాలు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

మాట్లాడుతున్న రామ్మోహన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నూతన విద్యా విధానం పేరుతో పేదలకు చదువును దూరం చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళతోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. సోమవారం నగరంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 12వ ప్లీనరీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు వసతి గృహాల్లో అనేక రకాలైన సమస్యలున్నాయని, మరో వైపు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్లు పేద విద్యార్థులకు అందకుండా ధరలు నిర్ణయించి అమ్ముకునే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నష్టదాయకంగా మారుతున్న విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి హరీష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డి. చందు, జిల్లా కమిటీ సభ్యులు ఎం. సంతోష్, టి. తిరుపతిరావు టి.మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

బూర్జ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాలవలస జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు ఆప్తాలమిక్ అధికారి బి.వి.ఎం.ప్రసాదరావు సోమవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు సిహెచ్.ప్రతాపరుద్రరావు, ఎంఎల్‌హెచ్‌పి అలేఖ్య, ఎఎన్‌ఎం చిన్నమ్మడు, ఆశావర్కర్ భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల నేత్రాలను పరీక్షిస్తున్న ప్రసాదరావు

'ఆరోగ్య సురక్ష'పై సమీక్ష

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఆర్‌డి ఉమాసుందరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 15 నుంచి జగన్న ఆరోగ్య సురక్షపై సర్వే నిర్వహించాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఉమాసుందరి సూచించారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలన్నారు. 16న ఎఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సందర్శించన ఉంటుందన్నారు. ప్రజల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించాలన్నారు. సమావేశంలో సురక్ష జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ బి.మీనాక్షి పాల్గొన్నారు.

పలాస : ఈ నెల 30 నుంచి 19 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రతిఒక్కరూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి రోగుల వివరాలను ఎప్పటికప్పుడు వైద్య అధికారులతో పాటు తమకు తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. సమావేశంలో మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, వైద్యులు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

నందిగాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాల విజయవంతానికి అధికారులు కృషి చేయాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై ఎంపిడిఒ శివప్రసాద్ అధ్యక్షతన సమీక్షించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు కురమాన బాలకష్ణారావు, తహశీల్దార్ పద్మావతి, ఎంఇఒ జి.నరసింహులు, వైద్యులు పి.అంజలి కె.అనిత పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సత్యసాయి సేవా సంస్థలు అంకిత భావం, నిస్వార్థమైన సేవలు అందిస్తుందని సత్య సాయి సేవా సంస్థల బాలవికాస్ కో-ఆర్డినేటర్, బూర్జ ఎంపిపి కర్నెన దీప అన్నారు. మండలంలోని వేణంపేట, అక్కులపేట సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యాన అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, భోజన ఏర్పాట్లను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు, కన్వీనర్ సిహెచ్. సూర్యారావు, అన్నదాత పేడాడ యువనీత్ ఉజ్వల్, వైద్యులు కూన మీనాకుమారి, వసంత పాల్గొన్నారు.

సీమంతాలు నిర్వహిస్తున్న బూర్జ ఎంపిపి దీప

గాంధీ విగ్రహానికి పాలాభిషేకం

విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

టిడిపి నాయకులు నిరసన తెలిపి గాంధీ విగ్రహానికి అపవిత్రం చేశారని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆరోపించారు. ఈ మేరకు గాంధీ విగ్రహానికి పసుపు నీళ్లతో శుద్ధి చేసి పాలాభిషేకం సోమవారం చేశామని అన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టుపై టిడిపి నాయకులు చేస్తున్న ఆందోళనలను ఎదుర్కోవడానికి వైసిపి నాయకులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, పలాస, వజ్రపుకొత్తూరు పిఎసిఎస్ అధ్యక్షులు పైల చిట్టిబాబు, దువ్వాడ మధుకేశవరావు, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, మందస ఎంపిపి డొక్కరి దానయ్య, కౌన్సిలర్ ప్రతినిధిలు అంబటి ఆనంద్, ఐల్ల శ్రీను, చింతాడ మాధవరావు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు వర్తించవా?

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి పిలుపు మేరకు జిల్లాలో బంద్ విఫలం చేసేందుకు పోలీసులు 144 సెక్షన్, 30 యాక్టు అమలు చేసిందని, ఇవి తమకు వర్తిస్తే వైసిపి నాయకులకు ఈ చట్టాలు వర్తించావా అంటూ టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు ప్రశ్నించారు. పలాస-కాశీబుగ్గలో వైసిపి నాయకుల ఆధ్వర్యాన మూకుమ్మడిగా గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేయడం పోలీసులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పోలీసులు తమ పార్టీ చెందిన వారిని అదుపులో తీసుకొని బంద్‌ను విఫలం చేసేందుకు ప్రయత్నించారని, అధికార పార్టీ నాయకులకు ఎందుకు అదుపులోకి తీసుకోలేదని, వారు చట్టాలకు అతీతులాని ప్రశ్నించారు.

చట్టం అందరికీ సమానమే

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం : ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన చంద్రబాబుకు శిక్ష తప్పదని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో సోమవారం విలేకరలతో మాట్లాడారు. ఎసిబి అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తునే అనేక స్కామ్‌లు బయటపడతాయని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే సిల్క్ డెవెలప్‌మెంట్ స్కామ్‌లో రూ.కోట్లు చేతుల మారిన విధానం మొత్తం బయట పడిందన్నారు. నిజంగా తప్పు చేయకుంటే న్యాయస్థానంలో న్యాయబద్ధంగా నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ చైరపర్సన్ భారతీ దివ్య, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, చాట్లా తులసీదాస్‌రెడ్డి, కె.మోహనరావు, ప్రచార కమిటీ జిల్లా చైర్మన్ తాడి ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఆమదాలవలస : చట్టం ఎవరికీ చుట్టం కాదని, అందరికీ సమానమేనని, తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. బొడ్డేపల్లిలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం మాజీ సిఎం చంద్రబాబు కనుసన్నల్లోనే జరిగిందని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి రాజకీయ కక్షతోనే చంద్రబాబును కేసులో ఇరికించారని టిడిపి నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పేడాడ వైకుంఠరావు, రాపాక ఎంపిటిసి మాజీ సభ్యులు పోతురాజు సూర్యారావు, కొంచాడ ఎంపిటిసి ప్రతినిధి పెయ్యల ప్రసాద్, బొడ్డేపల్లి మన్మథ, చింతాడ శివ, పైడి విజయ్, రాజశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

కవిటి : మాట్లాడుతున్న ప్రకాష్

సోంపేట: వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఇప్పటి ఎన్నో స్కామ్‌లు, నేరాలు చేస్తూ తప్పించుకున్నారని ఎంపిపి ఎన్.దాసు ఆరోపించారు. సోంపేటలో స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు నేరాలు కొత్తవి కాదని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బతకల మోహనరావు, జెసిఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, ఎంపిపిటిసి పొడుగు కామేష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : న్యాయవ్యవస్థపై సామాన్యులకు నమ్మకం పెరిగిందని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. సోమవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు చేసిన రాజకీయ అరాచకాలకు ముగింపు పలికినట్టయిందన్నారు. సత్తారు సత్యం, తమన్న గారి కిరణ్, టంకాల గుప్తా, వాకాడు శ్రీధర్ రెడ్డి, చుక్కాకుల జీవన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న గాంధీ

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న కృపారాణి

నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు హైప్రొఫైల్ నేరస్తుడని, తప్పు చేస్తే పర్యవసానాలు ఇలాగే ఉంటాయని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి తెలిపారు. సోమవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, మండల పార్టీ అధ్యక్షులు బగాది హరి, ఎన్ని మన్మథరావు పాల్గొన్నారు.

కవిటి : చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టం ఎవరికీ చుట్టం కాదని కవిటి ఎంపిపి ప్రతినిధి, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ అన్నారు. సోమవారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ నీలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.